# 18019 వద్ద తక్షణ నిరోధం



సెన్సెక్స్ విశ్లేషణ
అక్టోబరు 28తో ముగిసిన వారానికి

**సమీక్ష** : యూరోపియన్ యూనియన్ సదస్సు పరిణామాలు, మెరుగైన అమెరికా జీడీపీ గణాంకాలకు తోడు దేశీయంగా ఆర్థిక ఫలితాలు బాగుండడంతో గత వారం మార్కెట్ భారీ లాభాలను పొందింది. యూరోపియన్ యూనియన్ సదస్సు నేపథ్యంలో మార్కెట్ సానుకూలంగా మొదలైంది. అక్టోబరు నెల డెరివేటివ్ కాంట్రాక్టుల గడువు ముగింపు నేపథ్యంలో ఊగిసలాటకు గురి అయినప్పటికీ, ఆ సెంటిమెంటు తరువాత కొనసాగింది. రిజర్వు బ్యాంకు కీలక రేట్లను పావు శాతం మేర పెంచినా, ఇకపైన పెంపులకు ఆస్కారం ఉండకపోవచ్చని చేసిన వ్యాఖ్య మార్కెట్ జోరు అందుకోవడానికి తోడ్పడింది. త్రైమాసిక ఫలితాలు కలిసిరావడంతో వారాంతానికి సెన్సెక్స్ 1,019 పాయింట్ల లాభంతో 17805 వద్ద స్థిరపడింది.

**ఎఫ్ఐఐల పనితీరు** తొలుత భారీ స్థాయిలో అమ్మకాలు..తరువాత అదే స్థాయిలో కొనుగోళ్లు జరగడంతో విదేశీ సంస్థాగత మదుపుదార్ల(ఎఫ్ఐఐ ల) నికర అమ్మకాలు రూ.8 కోట్లుగా నమోదయ్యాయి. మరో పక్క మ్యూచువల్ ఫండ్లు సైతం రూ.131.30 కోట్ల అమ్మకాలు చేశాయి.

**రంగాల వారీగా** అంతర్జాతీయ మార్కెట్లపై విశ్వాసం పెరగడంతో మదుపర్లు లోహ, స్థిరాస్తి వంటి షేర్లపై మొగ్గుచూపారు. పండుగల సీజను కారణంగా వాహన షేర్లు భారీగా లాభపడ్డాయి. మార్కెట్ నష్టభయం ఎక్కువగా ఉండే సూచీల వైపు మొగ్గుచూపడంతో మన్నికైన వినిమయ వస్తువులు పెద్దగా రాణించలేకపోయాయి. పొదుపు ఖాతా రేట్లపై పరిమితులను ఆర్‌బీఐ తొలగించడంతో నికర వడ్డీ మార్జిన్లపై ప్రభావం పడొచ్చన్న సందేహాల మధ్య బ్యాంకింగ్ షేర్లలో బలహీనతలు కనిపించాయి.

**లాభపడ్డ, నష్టపోయిన షేర్ల నిష్పత్తి 3:2గా నమోదవడం.. మార్కెట్ సెంటిమెంట్ బులిష్ ధోరణికి మారినట్లు సూచిస్తోంది.**

**భవిష్యత్ అంచనా** దాదాపు 11 వారాల అనంతరం సెన్సెక్స్ 15700-17300 శ్రేణిని అధిగమించింది. తదుపరి కీలక నిరోధ స్థాయి.. 200 రోజుల చలన సగటు అయిన 18019 వద్ద ఉంది. ఈ స్థాయిని కూడా దాటి మార్కెట్ దూసుకెళితే ర్యాలీ 18600-19150 వరకూ కొనసాగొచ్చు. 17350 స్థాయి కంటే దిగువన ముగిస్తే మాత్రం మార్కెట్ స్వల్పకాల అధోముఖ ధోరణిలోకి అడుగుపెట్టిందని భావించాలి.

**ప్రభావిత అంశాలు** యూరో సదస్సు అనంతర అంతర్జాతీయ పరిణామాలను మార్కెట్ సునిశితంగా గమనించనుంది. ఈ వారం జీ20 సమావేశ విశేషాలు కూడా మార్కెట్‌పై ప్రభావం చూపనున్నాయి. దేశీయంగా త్రైమాసిక ఫలితాలు ఎంపిక చేసిన స్క్రిప్‌లలో కదలికలకు దారితీయవచ్చు. ఇక వాహన, సిమెంటు, టెలికాం గణాంకాలపై కూడా మదుపర్లు ఆసక్తిని ప్రదర్శించవచ్చు. ఆహార ద్రవ్యోల్బణం తన ధోరణిని కొనసాగించి మరింత పెరిగితే మార్కెట్‌పై ప్రతికూల ప్రభావం పడొచ్చు. డాలరు బలహీనతలు కొనసాగితే మొత్తం మీద సెంటిమెంటు మెరుగుపడొచ్చు.

**తక్షణ నిరోధ స్థాయిలు:** 18019, 18219, 18578; **తక్షణ మద్దతు స్థాయిలు:** 17504, 17350, 17212

**ప్రస్తుత ర్యాలీకి 18019 వద్ద తక్షణ నిరోధం ఎదురుకావొచ్చని అంచనా.**

*– సతీశ్ కంతేటి, జెన్‌మనీ*